కౌతాళం మండలంలో ఎండిపోయిన ఎస్ఎస్ ట్యాంకు

అఖిలప్రియ బాడీగార్డుపై

# హత్యాయత్నం

- కారుతో ఢీ కొట్టి మారణాయుధాలతో దాడి
- ఆళ్లగడ్డలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక మాజీమంత్రి భూమా అఖిలప్రియ బాడీగార్డ్ నిఖిల్ (పెద్ద సుబ్బరాయుడు)పై గుర్తు తెలియని దుండగులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. నిఖిల్, మరో స్నేహితుడితో కలిసి భూమా అఖిలప్రియ నివాసం బయట ఉండగా సినీపక్కిలో ఒక ఇన్నోవా కారు వేగంగా వచ్చి ఢీ కొట్టారు. కింద పడిన నిఖిల్‌ను కారులో నుంచి దిగిన ముగ్గురు దుండగులు మారణాయుధాలతో దాడి చేయడంతో గాయపడ్డాడు. కిందపడిన నిఖిల్ వెంటనే తేరుకొని వేగంతో అఖిలప్రియ ఇంటిలోకి వెళ్లాడు. వెంటనే అప్రమత్తమైన అఖిలప్రియ అనుచరులు బయటికి రావడంతో దుండగులు పారిపోయారు. తీవ్ర గాయాలతో ఉన్న నిఖిల్‌ను నంద్యాల ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. కాగా గత సంవత్సరం మే 16న నంద్యాలలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రలో టిడిపి నేత ఏవి సుబ్బారెడ్డిపై దాడి ఘటనలో నిఖిల్ ప్రమేయం ఉండడంతో సుబ్బారెడ్డి వర్గీయులు తిరిగి నిఖిల్ పై దాడికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనతో ఆళ్లగడ్డలో ఉద్రిక్తత నెలకొంది. భూమా అఖిలప్రియ, ఏవి సుబ్బారెడ్డి ఇంటి వద్ద పూర్తిస్థాయిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విషయంపై స్థానిక సీఐ రమేష్ బాబును వివరణ కోరగా సుబ్బరాయుడు అలియాస్ నిఖిల్ ను తాము విచారించామని, ఆయన ఫిర్యాదు మేరకు చంద్రతో పాటు మరి కొందరిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. పూర్తి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దాడిలో గాయపడిన నిఖిల్

# దాహం..దాహం...

- గుక్కెడు నీటికి తప్పని తిప్పలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజల మౌలిక వసతులు తీరుస్తామని, నీటి సమస్య లేకుండా పరిష్కరిస్తామని పాలకులు ఆర్భాటంగా హామీలు ఇచ్చినప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు. గుక్కెడు నీటి కోసం ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది...

హాలహర్వి మండలం బల్లూరులో చెలిమె వద్ద నీటిని తోడుకుంటున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 193 ఎస్ఎస్ ట్యాంకులు ఉన్నాయి. వాటిలో 10 శాతం ట్యాంకులు అడుగంటాయి. మిగిలిన వాటిలోనూ 50 శాతంలోపే నీరు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 32 సిపిడబ్ల్యుసి నీటి పథకాల ద్వారా ప్రజలకు నీటిని అందిస్తున్నారు. 4,261 చేతి పంపులు ఉండగా వాటిలో వేసవి వస్తే 210 చేతి పంపుల్లో నీళ్లు రావడం లేదు. మిగిలిన వాటిలోనూ అరకొరగా నీళ్లు వస్తున్నాయి. 796 పిడబ్ల్యు పథకాలు ఉండగా వాటిలో 692 మాత్రమే పని చేస్తున్నాయి. గ్రామాల్లో నీటి సమస్య తప్పడం లేదు.

కర్నూలు జిల్లాలోని ఆదోని, ఆలూరు, ఆస్పరి, దేవనకొండ, పత్తికొండ, హాలహర్వి, కోసిగి, పెద్దకడబూరు, హొళగుంద, గోనెగండ్ల, మంత్రాలయం మండలాల్లో నీటి ఎద్దడి నెలకొంది. కౌతాళం మండలం వల్లూరు, హాల్వి గ్రామాల మధ్య 30 ఎకరాల్లో రూ.10 కోట్లతో 12 గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం ఎస్ఎస్ ట్యాంకు నిర్మించారు. ట్యాంకుకు సరఫరా చేయడానికి సామర్థ్యం తక్కువ ఉన్న మోటార్లు ఉండడంతో నీరు నిల్వ చేయలేక పోయారు. తుంగభద్ర నది నీరు లేక ఎడారిగా మారడంతో ఎస్ఎస్ ట్యాంకు వెలవెలబోతోంది. దీంతో 12 గ్రామాలకు సరఫరా కావాల్సిన నీరు కేవలం రెండు మూడు గ్రామాలకు సరఫరా అవుతున్నాయి. దీంతో కుంభాలనూరు, కాత్రికి, గుడికంబాళి, గోతులదొడ్డి, హాల్వి గ్రామాలకు నేటి సరఫరా అంతంత మాత్రమే ఉండడంతో ప్రజలకు నీటి కష్టాలు మొదలయ్యాయి. హాల్వి గ్రామంలో ప్రత్యామ్నాయంగా రెండు బోర్లు వేసి నీటిని సరఫరా చేస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో ప్రత్యామ్నాయాలు లేక ప్రజలకు నీటి కష్టాలు ఏర్పడ్డాయి. ఆదోని మండలం మధిరలో తాగునీటి కోసం ప్రజలు బోరుపైనే ఆధారపడి ఉన్నారు. భూగర్భ జలాలు ఎండిపోవడంతో బోరులో నీరు రాక ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆదోని మండలం జాలమంచి, గణేకల్, పాండవగల్, బసాపురం, పెద్దహరివాణం, సంతేకుడ్లూరు, బైచిగేరి, కపటి, నెట్టేకల్, సాంబగల్, పెద్ద పెండేకల్, చిన్నపెండేకల్, దిబ్బనకల్ గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. తాగునీటి పథకాలకు తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో తాగునీటి దప్పిక తీర్చుకోవడమే రోజంతా పని చేయాల్సిన పరిస్థితి ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం, తారాపురం, గంగులపాడు, జాలవాడి, గవిగట్టు, కమ్మలదిన్నె, హెచ్.మురవని గ్రామాల్లో తీవ్ర తాగునీటి సమస్య ఉంది. చిన్నతుంబళం, గంగులపాడు గ్రామాల్లో పదిరోజులకు ఒకసారి కూడా నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కమ్మలదిన్నె, జాలవాడి గ్రామాల్లో ప్రజలే పది కుటుంబాలు కలిసి సొంతంగా బోర్లు వేసుకొని వాడుకుంటున్నారు. తాగటానికి ఫిల్టర్ నీటిని డబ్బులు పెట్టి కొనుకునే పరిస్థితి నెలకొంది. రెండు గ్రామాల్లో ఆర్ఒ

వార్త 6లో

# మూడంచెల్లో పటిష్ట భద్రత

- 16 స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద స్ట్రాంగ్ సెక్యూరిటి - ఓట్ల లెక్కింపు వరకు 144 సెక్షన్ అమలు
- స్ట్రాంగ్ రూమ్‌ల సిసికెమెరాల కమాండ్ కంట్రోల్ పరిశీలన - జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు రాయలసీమ యూనివర్సిటీలో 3 బ్లాకులలో , 16 స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ అన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతను కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ బుధవారం పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమెరాల కమాండ్ కంట్రోల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్ట్రాంగ్ రూమ్‌ల మూడంచెల భద్రతలో మొదటి స్థాయిలో కేంద్ర సాయుధ బలగాలు, రెండవ స్థాయిలో ఆర్మడు రిజర్వుడు బలగాలు, తృతీయ స్థాయిలో సివిల్ పోలీసు బలగాలను మోహరింపచేశామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ప్రతి స్ట్రాంగ్‌రూమ్, పరిసరాలలో సిసిటివి కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రతిస్ట్రాంగ్ రూమ్ వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో గస్తీ ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లకు ఉన్నత స్థాయి అధికారులను ఇంచార్జీలుగా నియమించామని చెప్పారు.ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ ఇంజన్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్‌లు కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్స్ ఏర్పరిచిన కేంద్రాల ఎంట్రెన్స్‌గేట్ లోపలికి , పరిసరాలలోకి గుర్తింపు కార్డులు లేని వ్యక్తులు లేదా అనధికార వ్యక్తులు , ఇతరుల వాహనాలకు అనుమతిలేదని అన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఔటర్ పెరిమీటర్ వరకు మాత్రమే వెళ్ళాలని, రిటర్నింగ్ అధికారులు ఇన్నర్ పెరిమీటర్ వరకు వెళ్ళాలని అన్నారు. స్ట్రాంగ్ రూమ్‌కి ఒకే ప్రవేశ ద్వారం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాం. గదికి డబుల్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. స్ట్రాంగ్ రూం 24 గంటలూ సాయుధ బలగాల రక్షణలో ఉంటుంది, సిసిటివి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించబడుతుందని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లో అమర్చిన సిసిటివి కెమెరాలు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (సిసిసి)కి కనెక్ట్ చేయబడ్డాయన్నారు. పారదర్శకంగా, అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగే వరకు దృశ్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లకు సిసిటివి కవరేజీతో సహా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించడానికి గెజిటెడ్ అధికారులతో పాటు, పోలీసు అధికారులు 24 గంటలూ డ్యూటీలో ఉండే విధంగా చర్యలు చేపట్టామని చెప్పారు. ఇవిఎంస్ట్రాంగ్ రూమ్‌లు సెక్యూరిటీ , కారిడార్ మొదలైన వాటి సీల్డ్ వేసిన డోర్‌లను కవర్ చేసే విధంగా సిఇసిటివికవరేజ్,వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లు తెరిచే ముందు, మూసివేసే సమయంలో సిసిటివి కవరేజ్/వీడియోగ్రఫీ మొత్తం సీలింగ్ ప్రక్రియ స్పష్టంగా కనిపించే విధంగా సిసిటీవీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సిసిటివి ఫుటేజీ డేటా నిల్వ ఉండే సిసిటివి కెమెరాలు అమర్చామన్నారు. ప్రతి ఎంట్రీ , ఎగ్జిట్ దగ్గర విజిట్ చేసిన అధికారులు రిజిస్టర్ / లాగ్-బుక్ లో సంతకాలు చేసే విధంగా ఏర్పాటు చేశామని చెప్పారు. ఇందులో పరిశీలకులుగా జిల్లా ఎన్నికల అధికారి , జిల్లా కలెక్టర్ లేదా జిల్లా ఎస్పీ లేదా ఆ పై స్థాయి అధికారులు ఉంటారన్నారు. జిల్లా ఎన్నికల అధికారి నుండి ఎప్పటికప్పుడు నివేదికను చీఫ్ఎలక్షన్ కమిషన్ అధికారికి పంపబడుతుందన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, పుకార్లు, అపోహాలను నమ్మవద్దని చెప్పారు. తొందరపడకుండా నిర్ధారణకు అవసరమైతే ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకువెళ్ళాలన్నారు. అపోహాలు, తప్పుడు సమాచారాలు నమ్మి జిల్లాలో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే పోలీసు శాఖ తీవ్రంగా పరిగణించి అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. అసాంఘిక శక్తులు, రౌడీ షీటర్ల పై ప్రత్యేక పోలీసు నిఘా కొనసాగుతోంది. జిల్లా ఎస్‌పి వెంట కర్నూలు డిఎస్‌పి కె.విజయశేఖర్, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐలు నాగరాజు యాదవ్, శ్రీనివాస రెడ్డి, కర్నూలు తాలుకా సిఐ శ్రీధర్, ట్రాఫిక్ సిఐ గౌతమి, ఆర్ ఐలు ఉన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి కృష్ణకాంత్

నృత్యోత్సవంలో పాల్గొన్న నటీమణులు

## కనుల పండుగలా సాగిన నృత్యోత్సవం

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

వేసవి వినోద సంబరాల్లో భాగంగా బుధవారం రాత్రి లలిత కళాక్షేత్రంలో కూచిపూడి జానపద పాశ్చాత్య నృత్య ప్రదర్శనలు కన్నుల పండుగగా సాగాయి. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలనం చేసిన కళాక్షేత్రం అధ్యక్షులు ఓబులయ్య మాట్లాడుతూ వేసవిలో ఓట్ల పండుగ ముగిసిన తర్వాత కన్నుల పండుగగా కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా మొదటి ప్రతిరోజు నృత్యం ఏర్పాటు చేశామన్నారు. నాట్యశిక్షకులు కరీముల్లా, రోహిత్ తేజేశ్వర్, సాయి ప్రదీప్, రామకృష్ణ శిష్య బృందం జానపద శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు చేశారన్నారు. గురువారం రాత్రి జబర్దస్త్ బృందంతో పాటు కళాకారులకు సత్కారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాట్య శిక్షకులు, శిష్యులతోపాటు డిఎస్‌పి మహబూబ్ బాషా, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జెఎన్.శేషయ్య, లలిత కళాసమితి కార్యదర్శి, నందిఅవార్డు గ్రహీత మొహమ్మద్ మియా, యాగంటీశ్వరప్ప, సంగా ఆంజనేయులు, ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుల ఆరోపణలు అవాస్తవం : వైసిపి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఈనెల 13న సాదారణ ఎన్నికలలో భాగంగా కల్లూరు అర్బన్ వీకర్ సేక్షన్ కాలనీలో ఒక పోలింగ్ కేంద్రంలో వైసిపి నాయకులు కాటసాని శివ నరసింహారెడ్డి టిడిపి నాయకులు శివ ఆచారి మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ సందర్భంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కుటుంబం పై టిడిపి నేత శివ చేసిన ఆరోపణలు అవాస్తవమని వైసిపి నాయకులు మధుమోహన్ రెడ్డి, వై.రవి, వాల్మీకి మధు కాంతారావు తెలిపారు. బుధవారం వీకర్ సెక్షన్ కాలనీలోని వైసిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాటసాని శివ నరసింహారెడ్డి మద్యం తాగి పోలింగ్ కేంద్రాలకు వచ్చారని టిడిపి నాయకులు ఆరోపించడం అర్ధరహితమన్నారు. సోమవారం రోజు ప్రత్యేక శివ పూజలు నిర్వహించే కుటుంబం మద్యం తాగుతారనడం తగదన్నారు. అర్థంపర్థం లేని మాటలు మాట్లాడితే భవిష్యత్తులో టిడిపి నాయకుని ఇంటి వద్ద ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. ఓ దళిత యువకున్ని అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయించి అతనికి ఓట్లు వేయించకుండా టిడిపి అభ్యర్థికి ఓట్లు వేయించడం దళితులను మోసం చేసినట్లు కాదా అని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గోపాల్, ఖలీల్,బాషా తదితరులు పాల్గొన్నారు.

## పండ్ల తోటల సాగుపై రైతుల దృష్టి..

రైతులకు ప్రభుత్వం వంద శాతం రాయితీ

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలంలోని రైతులు పండ్ల తోటల సాగుపై దృష్టి పెట్టారు. పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ఉపాధి పథకం కింద అధికారులు వంద శాతం రాయితీ కల్పిస్తున్నామని ఎంపిడిఒ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం మండలం పరిధిలోని వివిధ గ్రామాలలో ఆమె పండ్ల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే దాదాపు 500 ఎకరాలలో రైతులు పండ్ల తోటలు సాగు చేశారన్నారు. ఈ సంవత్సరం కూడా పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం వందశాతం రాయితీ కల్పిస్తుందన్నారు. ప్రస్తుతం మండలంలో వర్షాధారంపైనే రైతులు పంటలు సాగు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం పండ్ల తోటలు సాగు చేసే రైతులకు వంద శాతం రాయితీ కల్పించడంతో రైతులంతా పండ్ల తోటలు సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. పండ్ల తోటల సాగుపై ఎంపిడిఒ విజయలక్ష్మి, ఎపిఒ రామకృష్ణ ,జూనియర్ ఇంజనీర్ ప్రదీప్ తదితరులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్లు ఎంకప్ప, రాజశేఖర్, రామకష్ణ, చంద్రశేఖర్ , పరిదప్ప, రామంజి తదితరులు క్షేత్రస్థాయికి వెళ్లి పండ్ల తోటల సాగుపై వాటి పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు.

పండ్ల తోటల సాగును పరిశీలిస్తున్న ఎంపిడిఒ విజయలక్ష్మి

## కంగాటి శ్రీదేవి గెలుపు తథ్యం

### కాణిపాక ట్రస్ట్ మెంబర్ అరుణ

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కంగాటి శ్రీదేవి గెలుపు తథ్యమని కాణిపాక ట్రస్ట్ మెంబర్ బనగాని అరుణ పేర్కొన్నారు. బుధవారం వైసిపి కార్యాలయంలో ప్రజాశక్తితో కానిపాకం ట్రస్ట్ మెంబర్ బనగాని అరుణ మాట్లాడుతూ ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పత్తికొండ నియోజకవర్గం ప్రజలు వైసిపి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వైపు మక్కువ చూపారని అన్నారు. పత్తికొండను అన్ని విధాలుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేయడంలో ముందుందని అన్నారు. ఆమె చేసిన అభివృద్ధి గెలిపిస్తుందని కొనియాడారు. రెండోసారి రాష్ట్రానికి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యేగా శ్రీదేవి ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు హర్షం వ్యక్తం చేశారు.

## వీకర్‌సెక్షన్ కాలనీని వెంటాడుతున్న సమస్యలు

-చావులోనూ వీడని కష్టాలు -తాగునీటి కోసం తప్పని తిప్పలు
-డ్రైయినేజీలు అస్తవ్యస్తం -36, 37, 41 వార్డుల్లో సమస్యల తిష్ట
-ఏమాత్రం పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలోని వీకర్‌సెక్షన్ కాలనీ ప్రజలను సమస్యలు వెంటాడుతున్నాయి. స్థానిక ప్రజలు ఏళ్లకు ఏళ్లుగా సమస్యల వలయంలో మగ్గుతున్నారు. చివరికి చావులోనూ కష్టాలు వారిని వదలడం లేదంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఆరు నెలలకు ఓమారు కాలువల్లో పూడిక తీసే వైనం ఇక్కడ సర్వసాధారణం. డ్రెయినేజీ అస్తవ్యస్తంగా మారింది. తాగునీటికి కూడా రెగ్యులర్‌గా సరఫరా చేయలేని పరిస్థితి. కాలనీవాసులు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది.స్వాతంత్ర్య సమరయోధుడు పచ్చలపల్లి సుందరయ్య పేరుతో ఏర్పాటు చేసిన పార్కును అభివృద్ధి చేయాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిస్కారం కావడం లేదు.

**మరణంలోనూ వీడని కష్టం :** కర్నూలు నగరంలోని 36, 37,41 వార్డుల పరిధిలో సుమారు 40 వేల మంది జనాభా నివాసం ఉంటున్నారు. ఇక్కడి ప్రజలు ఎవరైనా మరణిస్తే వారి మరణంలోనూ కష్టం వారిని వెంటాడుతుంది. ఈ వార్డుల్లో నివసించే ప్రజలంతా ఎవరు చనిపోయిన ఎన్‌టిఆర్ నగర్‌లో ఉన్న స్మశాన వాటికకే తీసుకెళ్లి ఖననం చేస్తుంటారు. ప్రధానంగా స్మశాన వాటికలో నెలకొన్న భౌగోళిక పరిస్థితులే వారి పాలిట శాపంగా మారాయి. స్మశాన వాటికలో శవాన్ని పూడ్చి పెట్టేందుకు కనీసం ఆరు అడుగుల లోతు గొయ్యి తవ్వాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ స్మశాన నేలలో రాతిబండ పరుచుకొని ఉండడంతో కేవలం రెండు మూడు అడుగులు కూడా లోతు తవ్వక ముందే బండరాయి అడ్డుపడుతోంది. దీనితో శవాన్ని మూడు అడుగుల లోతు లోపలే పూడ్చి దానిపైన ఇతర ప్రాంతం నుంచి మట్టితో తరలించి తెచ్చి పూడ్చాల్సి వస్తోంది. ఇది ప్రజలకు తీవ్రమైన శ్రమతో కూడిన పనిగాను, ఆర్థికంగా భార మైన సమస్యగా పరిణమిస్తుంది. శవాన్ని పైనే పూడ్చి పెట్టడం వల్ల కుక్కలు, నక్కలు శవాలను బయటకు తీసే పరిస్థితి ఉంది.

**మురుగు కాల్వల పూడికతీత మరుగు**

పేదలు నివసించే ఈ కాలనీలో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. రోజు పూడికతీత కాకపోయినా కనీసం వారానికోసారి పూడికతీసినా సమస్య కొంత సదుమనిగే పరిస్థితి ఉంటుంది. కానీ నాలుగు నుంచి ఆరు నెలలకు ఒక మారు డ్రైనేజీ కాలువలను పూడిక తీయడం ఇక్కడ పరిపాటిగా ఉందని స్థానికులు వాపోతున్నారు. దీన్ని పట్టి ఇక్కడ పారిశుధ్య పరిస్థితి ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు.

**తాగునీటికి ఎదురుచూపులే...**

నగరంలో ప్రతిరోజూ తాగునీటిని అందించాల్సి ఉండగా రోజు మార్చి రోజు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. 20 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకులతోనే నీటిని సరఫరా చేస్తున్నారు. జనాభా పెరుగుదల రెట్టింపైనా సరే దానికి అనుగుణంగా కొత్త ట్యాంకులను ఏర్పాటు చేయకపోవడమే ఈ సమస్యకు దారితీస్తోంది.

**ఓట్లు తప్ప ప్రజల పాట్లు పట్టవా?**

కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పలుమార్లు స్థానిక ప్రజా ప్రతినిధులను అధికారులను ఎన్నోమార్లు కలిసి సమస్యను వివరించినప్పటికీ ఎలాంటి స్పందన కనిపించడం లేదని ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

డ్రెయినేజీ కాలువలో పేరుకు పోయిన చెత్త

**ఆరు నెలలకు ఒకసారి కాలువ శుభ్రం**

**లక్ష్మి, స్థానికురాలు**

కాలనీలో డ్రైనేజీ కాలువలను ఆరు నెలలకోసారి శుభ్రం చేస్తున్నారు. కాలువల్లో చెత్త పేరుకుపోయి మురుగు తో కంపు కొడుతున్నాయి. పట్టించుకునే నాధుడే లేడు.

**ఏడ తవ్వినా బండే : అయ్యన్న, స్థానికుడు**

ఎన్‌టిఆర్ బిల్డింగ్స్‌లోని స్మశానంలో ఎక్కడ తవ్విన బండరాయి పడుతోంది. శవాలను పూడ్చాలంటే తలప్రాణం తోక మీదకి వస్తుంది. సమస్యను ఎవరికి చెప్పినా పట్టడం లేదు.

**నీటి కోసం ఎదురు చూడాల్సిందే**

**ఇందు, స్థానికరాలు**

మంచినీళ్లు రోజు మార్చి రోజు వస్తాయి. కుళాయికి మోటారు వేసి తోడితే తప్ప నీళ్లు రావు. రెంటు బిల్లు మోత మోగుతుంది. ఉచిత కరెంట్ కి దూరమయ్యాం.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విరుపాక్షి

## రాష్ట్రంలో, ఆలూరులో
# వైసిపి గెలుపు ఖాయం

- తన ఓటమి కోసం ఎన్నో కుట్రలు చేశారు...
- నాయకులు, కార్యకర్తల కృషి వెలకట్టలేనిది...
- వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి

**ప్రజాశక్తి - ఆలూరు**

రాష్ట్రంలో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి గెలుస్తారని, ఆలూరు నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా గెలుస్తానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరుపాక్షి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం ఆలూరులోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 10న జగన్మోహన్‌రెడ్డి ఆలూరు నియోజకవర్గానికి వైసిపి ఇన్‌ఛార్జీగా తనను ప్రకటించడంతో గత పాలకునికి గుండెల్లో రైళ్లు పరుగెత్తాయని తెలిపారు. పార్టీలో నాయకులు వెళతారు.. వస్తారు కానీ కార్యకర్తలే పార్టీని అంటిపెట్టుకొని పునాదులుగా ఉండి కాపాడుకుంటారని చెప్పారు. పార్టీకి, తనకు కార్యకర్తలను, నాయకులను దూరం చేయాలని బెదిరింపులకు పాల్పడినా తలొగ్గకుండా పార్టీ ఆదేశాలే శిరోధార్యమని నేటి ఎన్నికల్లో గెలుపునకు శక్తికి మించి కృషి చేశారని తెలిపారు. తన ఓటమి కోసం ఎందరో కుట్రలు, కుతంత్రలు పన్నినా రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, తాను ఆలూరు ఎమ్మెల్యేగా గెలవడాన్ని ఎవరూ ఆపలేరన్నారు. అందుకు ఆరు మండలాల ఓటరు మహాశయులకు, కార్యకర్తలకు, మండల స్థాయి నాయకులకు, జడ్‌పిటిసిలకు, ఎంపిపిలకు, ఎంపిటిసిలకు, సర్పంచులకు, మండల కన్వీనర్లకు, సచివాలయ కన్వీనర్‌లందరికీ ధన్యవాదాలు తెలిపారు. శశికళ, మారయ్య, జనార్ధన్ నాయుడు, దొరబాబు, షఫీవుల్లా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'వేదిక' గెలుపు కోసం కృషి చేసిన
# వారందరికీ ధన్యవాదాలు

- కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కిషోర్

**ప్రజాశక్తి - ఆలూరు**

ఇండియా వేదిక బలపరిచిన ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా తన గెలుపు కోసం కృషి చేసిన నియోజకవర్గ ఓటర్లకు, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ నాయకులకు, కార్యకర్తలకు అరకట్ల నవీన్ కిషోర్ ధన్యవాదాలు తెలిపారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నవీన్ కిషోర్, సిపిఎం జిల్లా నాయకులు పి.హనుమంతు, మండల కార్యదర్శి షాకీర్, సిపిఐ నాయకులు మారెన్న మాట్లాడారు. తక్కువ సమయంలో ఆరు మండలాల్లో వేసవిని లెక్క చేయకుండా ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను తీసుకెళ్లి ప్రచారం చేయడంలో ఆరు మండలాల కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేశారని తెలిపారు. దేశ, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం ఇండియా వేదిక గెలుపు చాలా అవసరమన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించడంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపి, రాష్ట్రంలోని వైసిపి, టిడిపిలకు ఓటుతో బుద్ధి చెప్పేందుకు కృషి చేసిన ఓటర్లకు మరోసారి ధన్యవాదాలు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న నవీన్ కిషోర్

# పార్టీ బలోపేతానికి కృషి

- ప్రజా క్షేత్రంలోనే ఉంటాం
- నైతిక విజయం కాంగ్రెస్‌దే
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ యాదవ్

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ యాదవ్ తెలిపారు. బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో సిపిఎం, సిపిఐ నాయకులతో కలిసి కృతజ్ఞత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ఏ గ్రామానికి వెళ్లినా బృందానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆదోని నియోజకవర్గంలో వామపక్ష పార్టీలు సహకారంతో గ్రామ వార్డుల్లో పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు. ప్రతి వార్డు, గ్రామం నుంచి అభ్యర్థులను సర్పంచి, ఎంపిటిసి, కౌన్సిలర్‌గా బరిలో నిలిపేందుకు ప్రణాళిక రచిస్తామని తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించేలా ప్రజా క్షేత్రంలోనే ఉంటామని చెప్పారు. వైసిపి, బిజెపిలు ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా ఈ ఎన్నికల్లో ఓటర్లు ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ వైపే మొగ్గు చూపారని తెలిపారు. ఎన్నడూ లేనివిధంగా 70 శాతం దగ్గరగా పోలింగ్ నమోదు అయిందన్నారు. కొత్త ఓటర్లు కాంగ్రెస్ వైపే మొగ్గు చూపారని ధీమా వ్యక్తం చేశారు. ఆదోని ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. సామాజిక సేవ చేస్తూ ప్రజాసేవకు అంకితమైన తన పట్ల ఆదరణ చూపారని, ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి ఆగడాలను ఎదుర్కోవడం అంటే ఇండియా వేదిక పార్టీలకే సాధ్యమన్నారు. కేంద్రంలో ఇండియా వేదిక తప్పకుండా అధికారంలోకి వస్తుందని, అందరి సహకారంతో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం తెచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించిన అధికారులకు, అధికంగా పోలింగ్‌లో పాల్గొన్న ప్రజలకు, ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాల్లో దృశ్యాలను చిత్రీకరించిన మీడియా మిత్రులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సిపిఎం నాయకులు పిఎస్.గోపాల్, తిప్పన, సిపిఐ నాయకులు అజయ్ బాబు, లక్ష్మారెడ్డి, కల్లుబావి రాజు, సుదర్శన్, కాంగ్రెస్ నాయకులు దిలీప్ ఢోకా, మారుతి, హనుమంతు, దేవి శెట్టి వీరేష్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ యాదవ్

నిందితుని, మద్యాన్ని చూపుతున్న పోలీసులు

## కర్ణాటక మద్యం స్వాధీనం

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని మండలం విరుపాపురం, తంగరడోణ ఆర్చి వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సిఐ విన్నీలత తెలిపారు. బుధవారం స్వాధీనం చేసుకున్న మద్యాన్ని, నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డి.కోటకొండ పాపన్న, తురవగల్లు నరసన్న, మునసపల్లి ధనుంజయను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 20 బాక్సులు, 1,920 కర్ణాటక మద్యం ప్యాకెట్లను పట్టుకొని కారును సీజ్ చేశామని తెలిపారు. కర్ణాటక అక్రమ మద్యం, నాటుసారా రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేకంగా నిఘా ఉంచామని సెబ్ సిఐ విన్నీలత తెలిపారు. సిబ్బంది సోమశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు డబ్బా ఈరన్న, మాడికాయల రాజు

# బీవీ గెలుపు తథ్యం

- ప్రశాంత ఎన్నికలకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు
- టిడిపి నాయకులు

**ప్రజాశక్తి - నందవరం**

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి గెలుపు తథ్యమని టిడిపి గ్రామ యూనిట్ ఇన్‌ఛార్జీ డబ్బా ఈరన్న, బూత్ కన్వీనర్ మాడికాయల రాజు తెలిపారు. ఎన్నికల్లో భాగంగా కనకవీడు గ్రామంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని చెప్పారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో ప్రశాంతతకు మారుపేరైన కనకవీడు గ్రామంలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే అధికార వైసిపి ఎన్ని కుతంత్రాలకు పాల్పడినా ప్రజలు మాత్రం టిడిపి వైపే ఉన్నారని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసే బీవీ.జయ నాగేశ్వరరెడ్డి కచ్చితంగా ఎమ్మెల్యేగా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రానికి చంద్రబాబు గెలుపు ఎంతో అవసరమన్నారు. బూత్ కన్వీనర్లు మాల దొడ్డి ఈరన్న, పిడుగు అనుమంతు, మీనుగ ఈరన్న, మలయ్య గారి ఈరన్న, ఎస్.దుబ్బన్న, లాజర్, ఆదాము పాల్గొన్నారు.

## ఉపాధి పనులకు వెళ్తున్న
# మహిళపై దున్నపోతు దాడి

- తీవ్ర గాయాలు, ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స

**ప్రజాశక్తి - చిప్పగిరి**

ఉపాధి పనులకు వెళ్తున్న చిప్పగిరి గ్రామానికి చెందిన తలారి గౌరమ్మ అనే మహిళపై ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో బుధవారం దున్నపోతు దాడి చేసింది. గమనించిన తోటి ఉపాధి కూలీలు దున్నపోతును తరమేందుకు ప్రయత్నించారు. మరింత రెచ్చిపోయిన దున్నపోతు గౌరమ్మపై మరోసారి విరుచుకుపడి దాడికి పాల్పడింది. ఈ దాడిలో గౌరమ్మ తీవ్రంగా గాయపడ్డారు. దాడిలో తీవ్రంగా గాయపడిన గౌరమ్మను గుంతకల్లులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. గౌరమ్మకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని తోటి ఉపాధి కూలీలు, కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

# ఇరుకుగా రోడ్లు...

- పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- ముఖ్యమంత్రి హామీని అమలు చేయని అధికారులు

**ప్రజాశక్తి - ఆదోని**

రోడ్ల వెడల్పు చేయించి, ఆదోని పట్టణ అభివృద్ధికి అహర్నిశలు పాటు పడతామని పాలకులు చెబుతూనే ఉన్నారు. ప్రభుత్వాలు మారినా, ఎమ్మెల్యేగా ఎవరు ఎన్నికైనా ఆదోని పట్టణ అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదు. మిల్లులు, పరిశ్రమలు ఉండడం వల్ల వందలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తూ ఆదోని గతంలో వ్యాపార కేంద్రంగా వెలిగింది. ప్రస్తుతం మారిన సంస్కరణల వల్ల మిల్లులు, పరిశ్రమలు మూతపడడంతో ఉపాధి కరువై యువత, కూలీలు ముంబయి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్న పరిస్థితి ఉంది. ఇక్కడ కొత్తగా పరిశ్రమలు పెట్టేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, నీటి వసతి మాత్రం కల్పిస్తే మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని పలువురు చెబుతున్నా, ఆ దిశగా పాలకులు కృషి చేయడం లేదన్నది తెలిసింది.

వాహనాలతో రద్దీగా ఉన్న మెయిన్ రోడ్డు

**ఇరుకైన రోడ్లు**

ఆదోని పట్టణంలో మున్సిపల్ మెయిన్ రోడ్డు గుండానే బళ్లారి, సిరుగుప్ప, రాయచూర్, మంత్రాలయం ప్రాంతాలకు వాహనాలు వెళ్లాల్సి ఉంది. ఆ రోడ్డు గుండానే వ్యవసాయ మార్కెట్ యార్డుకు పంట ఉత్పత్తులు వాహనాల్లో తరలుతున్నాయి. ఉదయం పూట పాత బస్టాండ్ కూడలిలో వాహనాలు నిలిచి ఆ ప్రాంతమంతా రద్దీగా మారుతోంది. ప్రత్యామ్నాయ రోడ్డు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి పోలీసు కంట్రోల్ రూమ్ వరకు 80 అడుగులు, ఎమ్మిగనూరు టర్నింగ్ నుంచి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ వరకు 100 అడుగులు, ఎమ్మిగనూరు టర్నింగ్ నుంచి కొత్త బస్టాండ్ బైపాస్ రోడ్డు వరకు 80 అడుగులు రోడ్డు వెడల్పు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రస్తుతం అన్యాక్రాంతం కారణంగా రోడ్లు ఇరుకుగా మారాయి.

**పెరిగిన వాహనాలు :** పట్టణంలో సుమారు 2.5 లక్షలకు పైగానే జనాభా ఉంది. రోజూ చుట్టుపక్కల ప్రాంతాల వారు వ్యాపార, ఇతర పనుల నిమిత్తం వచ్చే వారి సంఖ్య అధికంగానే ఉంటుంది. ఈ కారణంగా వాహనాలు వాడే సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతోంది. కనీసం బైక్‌లు నిలుపుకునేందుకు కూడా స్థలం లేకపోవడంతో రోడ్ సైడ్ నిలిపి పోలీసు కేసులు పెట్టించుకుంటూ జరిమానాలు చెల్లించాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు.

**అమలు కానీ ముఖ్యమంత్రి హామీ :** ఆదోని పట్టణంలో రోడ్డు వెడల్పునకు రూ.60 కోట్లు కేటాయిస్తున్నామని గతేడాది జులై మాసంలో ఆదోని పర్యటనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి ఏడాది గడిచినా అమలుకు నోచుకోకపోవడంతో అధికారుల అలసత్వం తేటతెల్లమవుతోంది. మున్సిపల్ మెయిన్ రోడ్డు నుంచి పిఎన్ రోడ్డు, ఎంఎం రోడ్లలో 1.20 కిలోమీటరు చొప్పున వెడల్పు చేసేందుకు అధికారులు కొలతలు వేశారు. నిధులు చాలకపోవడంతో రికార్డులకే పరిమితమైంది. రోడ్డు వెడల్పు 60 అడుగులు చేయాలని అందులో ఉందని అధికారులు చెబుతున్నారు. నష్టపరిహారం సహాయంతో కలిపి రూ.1.60 కోట్లు అవసరం ఉందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

### ఎన్నికల హామీని నెరవేర్చాలి

- ఈరన్న, పట్టణ పౌర సంఘాల సమైక్య కన్వీనర్, మాజీ కౌన్సిలర్

రోడ్లు ఇరుకుగా ఉండడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదోని నుంచి బయటకు వెళ్లేందుకు మరో రోడ్డు లేకపోవడం వల్ల పట్టణం గుండానే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అన్యాక్రాంతమైన లింక్ రోడ్లు వెడల్పు చేసి పట్టణ అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలి. రోడ్లు వెడల్పు చేస్తామని, మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి నిలబెట్టుకోవాలి. అధికారులు నిర్లక్ష్యం చేస్తే పురవాసులతో ఆందోళన నిర్వహిస్తాం.

మృతి చెందిన అనసూయమ్మ

## కడుపునొప్పి తాళలేక
# మహిళ ఆత్మహత్య

**ప్రజాశక్తి - హోళగుంద**

మండలంలోని వందవాగిలి గ్రామానికి చెందిన గొల్ల అనసూయమ్మ (30) కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారి వివరాల మేరకు... అనసూయమ్మ గత ఆరు నెలల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నారు. కడుపు నొప్పి నయంకాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చికిత్స నిమిత్తం ఆమెను ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ ఎం.శ్రీనివాసులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

# సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

ఎంఎ. హఫీజ్ ఖాన్

సార్వత్రిక ఎన్నికల్లో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ. హఫీజ్ ఖాన్ అన్నారు. ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు తమ శక్తి వంచన లేకుండా నాయకులతో అనుసంధానమై పార్టీ గెలుపు కోసం కృషి చేశారని అన్నారు. ఈ ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తలు నిద్రాహారాలను లెక్కచేయకుండా తమ శక్తి వంచన లేకుండా పాటు పడ్డారన్నారు. అదేవిధంగా ఎన్నికల అధికారులు, పోలీసులు సైతం ఎన్నికల ప్రక్రియలో కష్టపడి పని చేశారని వారందరికీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు

# దాహం.. దాహం...

5వ పేజీ తరువాయి...

ప్లాంట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉపయోగంలో లేవు. గవిగట్టు గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. హెచ్.మురవని గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు డబ్బులు వెచ్చించి కొనుగోలు చేసుకుంటున్నారు. హాలహర్వి మండలం బల్లూరులో నీటి ఎద్దడి వల్ల రెండు కిలోమీటర్ల దూరంలో వేదవతి నదీ లోపల చెలిమి తోడి నీటిని తీసుకొస్తున్నారు. మండలంలోని కుక్కరచేడు, బెవినహాళ్, ఛాగిబండ, సిద్ధాపురం, బల్లూరు గూళ్యం, మచనూరులోనూ నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. మండల కేంద్రమైన ఆస్పరితో పాటు తురవగల్లు, ఐనేకల్లు, తోగలగల్లు, డి.కొటకొండ, బైలు పత్తికొండ, గార్లపెంట, ములుగుందం, జోహరపురం, దొడగొండ, హలిగేర గామాల్లో నీటి ఏద్దడి నెలకొంది. పుష్పాలదొడ్డి గ్రామంలో 130 కుటుంబాలు ఉండగా 947 మంది ప్రజలు నివసిస్తున్నారు. ఈ గ్రామానికి ప్రధానంగా నీటి సరఫరా కోసం గ్రామ సమీపంలోని చెరువులో రెండు బోర్లు వేయించారు. చెరువులో భూగర్భ జలాలు అడుగంటడంతో అరకొర నీటి సరఫరా అవుతోంది. రాత్రి అయినప్పటికీ జాగరణ చేసి ప్రజలు నీటిని తెచ్చుకుంటున్నారు. నీటి కోసం ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యక్తి ప్రత్యేకంగా ఇంటి వద్ద ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఆలూరు పట్టణంలో 15 రోజులకోసారి తాగునీరు వస్తున్నాయి. హాలహర్వి మండలం బాపురం పథకం నుంచి సరఫరా అవుతోంది. వేసవికి ముందుగానే తాగునీటి కొరత ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**కర్నూలు కార్పొరేషన్‌లో పరిస్థితి ఇదీ..**

కర్నూలు జనాభాకు రోజూ 120 ఎంఎల్‌డి నీరు అవసరం కాగా ప్రస్తుతం 85 ఎంఎల్‌డి నీరు అందిస్తున్నారు. నగరానికి తాగునీటి అవసరాలు తీర్చే సుంకేసుల జలాశయం నుంచి నీరు సరఫరా చేసే పరిస్థితి ఉండేది. అక్కడ కూడా నీరు అడుగండిపోవడంతో గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీటిని తెచ్చుకొని వాడుకునే పరిస్థితి నెలకొంది. నగరంలోని 52 వార్డుల్లోనూ నీటి ఎద్దడి ఉండగా లక్ష్మీపురం, పెద్దపాడు, పందిపాడులో నీటి సమస్య తీవ్రంగా ఉంది. నగర పాలక సంస్థ సరఫరా చేసే ట్యాంకర్ల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ట్యాంకర్లు వచ్చినప్పుడు వంతుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. నీటి యుద్ధాలు కూడా తప్పడం లేదు. మూడురోజులకోసారి ట్యాంకర్ వస్తుండడంతో పట్టుకున్న నీరు మూడు రోజులకు సరిపోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీరు తక్కువగా ఉండడంతో ఏప్రిల్ 1 నుంచి రోజు విడిచి రోజు తాగునీరు విడుదల చేస్తున్నట్లు కమిషనర్ భార్గవ్ తేజ్ ప్రకటించారు.

ఆస్పరి మండలం పుష్పాలదొడ్డిలో నీటి ట్యాంకు వద్ద ఎదురుచూపులు

ఆదోని మండలం బైచిగేరిలో నీటి కోసం ఎదురుచూపులు

### నీటి సమస్యను పరిష్కరించండి

- రామాంజనేయులు, పుష్పాల దొడ్డి, ఆస్పరి మండలం.

మా గ్రామంలో 130 కుటుంబాలు ఉన్నాయి. తాగడానికి నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. నీటి సమస్యను పరిష్కరించే నాథుడే కరువయ్యాడు. బిందెడు నీటి కోసం రాత్రనక, పగలనక కుళాయి దగ్గర వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజాప్రతినిధులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి.

### నీటి కోసం తీవ్ర ఇక్కట్లు

- లేపాక్షి, సిద్ధాపురం, హాలహర్వి మండలం.

తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇలాంటి దుర్భర పరిస్థితిని ఇంత వరకు చూడలేదు. రాత్రింబవళ్లు మోటార్ల వద్ద కాపలా ఉన్నా సరిపడ నీరు దొరకడం గగనమైంది.

### 15 రోజులకోసారి నీళ్లు వస్తున్నాయి

- విఠల్, సిద్ధేశ్వర కాలనీ, ఆలూరు.

మా కాలనీలో ప్రతేడాది తాగు నీటి సమస్య తీవ్రంగా ఉంటుంది. ఈ ఏడాది కూడా ఇదే సమస్య పునారావృతం అవుతోంది. ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యంతో నీటి కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి.

# ఎవరి ధీమా వారిదే

**ఓట్ల లెక్కింపుల్లో మునిగితేలుతున్న నాయకులు**

**గెలుపోటములపై అంచనాలు -నాయకులలో ఆందోళన**

**పజాశక్తి-కర్నూలు క్రైమ్** : ఎన్నికలు పూర్తయిన రోజు నుంచే రాజకీయ నాయకుల్లో గెలుపోటములపై ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. విజయ అవకాశాలపై ఉన్న అనుకూల ప్రతికూల పరిస్థితులను ఎవరికి వారు విశ్లేషణ చేసుకుంటున్నారు. ఎక్కడ చూసినా ఎవరినడిగినా ఏ నోట విన్నా ఏ పార్టీ వస్తుంది ఏ అభ్యర్థి గెలుస్తారు అనే చర్చలే ప్రధానంగా జన ప్రవంతిలోనూ వినిపిస్తున్నాయి. కాగా రాజకీయ నాయకులలో మాత్రం వారి గెలుపోటములపై ఆందోళన సైతం హృదయాంతరాల్లో వెంటాడుతోంది. ముఖ్యంగా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎవరికివారు ఓట్లు పూర్తయిన నాటి నుంచే తమ నాయకులను, కార్యకర్తలను, బూతు ఏజెంట్లను తమ వద్దకు పిలిపించుకొని బూతుల వారీగా విశ్లేషించుకుంటున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ప్రధానంగా తాము చేపట్టిన నగదు పంపిణీ, వివిధ ప్రలోభాల ప్రభావంతో పాటు, సామాజిక తరగతి, సామాజిక వర్గం, మతం ప్రభావం కూడా ఏ మేరకు ఉంటుందోనని విశ్లేషణలు చేసుకుంటున్నారు. ఓవైపు తమ అంచనాలు వేసుకుంటూ ఎవరికి వారు గెలుపు మాదే అని విశ్వాసాన్ని ప్రకటిస్తున్నప్పటికీ, మరోవైపు ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారోనన్న ఆందోళన సైతం వారిని వెంటాడుతోంది. ఏది ఏమైనా జూన్ 4వ తేదీ ప్రకటించనున్న ఎన్నికల ఫలితాల ద్వారానే స్పష్టమైన తీర్పు ప్రజల నుంచి వెలువడనుంది. అంతవరకు వేచి చూడక తప్పదు.

# దుద్యాల రోడ్డు బాగుపడేనా?..

- అభివృద్ధికి దూరంగా 20 ఏళ్లు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

**కర్నూలు మండలం దుద్యాల గ్రామానికి వేసిన రోడ్డు అస్తవ్యస్తంగా మారి 20 ఏళ్లు గడిస్తున్న పట్టించుకునే నాథుడు కరువయ్యారు. కర్నూలు సుంకేసుల రోడ్డులో దుద్యాల స్టేజి వద్ద నుంచి దుద్యాల గ్రామానికి సుమారు రెండున్నర కిలోమీటర్లు పొడవున 20 ఏళ్ల క్రితం రోడ్డును నిర్మించారు. కొద్ది సంవత్సరాల తర్వాత ఆ రోడ్డు అస్తవ్యస్తంగా తయారై రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.**

కర్నూలు మండలం దుద్యాల గ్రామంలో 1800 మంది జనాభా ఉండగా సుమారు 1200 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామం నుంచి ఇతర గ్రామాలకు కర్నూలు సుంకేసుల ప్రయాణించాలన్న ఈ రోడ్డు మీదుగానే ప్రజలు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. 20 ఏళ్లుగా గ్రామంలో చిన్నపిల్లలు మొదలుకొని వద్దుల వరకు అందరూ ఈ దారి గుండానే ప్రయాణించాల్సి ఉంది. ప్రస్తుతం ఆ రోడ్డు అడుగడుగునా గుంతలతో, కంకర తేలి దర్శనమిస్తోంది. కొన్నిచోట్ల వ్యవసాయ పొలాల్లో నుంచి వచ్చిన నీరు మోకాళ్ళ లోతు ఆగి చిన్నపాటి వాగును తలపిస్తుంది. ప చెట్లు పొదలు పెరిగి రోడ్డుకు అక్కడక్కడ అడ్డంగా విస్తరిస్తున్నాయి. ఈ రోడ్డు గుండా వాహనాల్లో వెళ్లాలంటే నరకం చవిచూడాల్సి వస్తోంది. రోడ్డు నిర్మాణం సరిగా లేదన్న కారణంతో బస్సు సౌకర్యం కూడా అందుబాటులో లేకుండా పోయింది. గర్భిణులను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. ఉదయం పూట 9 గంటలకు పాఠశాలకు వెళ్లాల్సిన విద్యార్థులు రోడ్డు సరిగా లేని కారణంగా కాలినడకని నమ్ముకోవాల్సి వస్తుంది ఈ నేపథ్యంలో విద్యార్థులు 7 గంటలకే తమ ప్రయాణాన్ని మొదలు పెట్టాల్సి వస్తుంది. గ్రామంలో ఉన్న రోడ్డు సమస్యను గురించి ఇది వరకే డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ పలు దఫాలుగా పలువురు ప్రజాప్రతినిధులకు మండల జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు అనేకమార్లు మొరపెట్టుకున్నా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారయింది. ఎన్నికలకు ముందు గ్రామానికి వచ్చిన ప్రతి ప్రజా ప్రతినిధి రోడ్డు పునరుద్ధరణకు గురించి ఇచ్చిన హామీలు గాలికొదిలేశారని, ఈసారి గెలిచిన వారయినా రోడ్డు సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

# సహకరించిన వారికి కృతజ్ఞతలు : ఎస్ఐ

**ప్రజాశక్తి-తుగ్గలి**

ప్రజలతో మాట్లాడుతున్న తుగ్గలి ఎస్ఐ

తుగ్గలి పోలీస్ స్టేషన్ పరిధిలోనే అన్ని గ్రామాలలో ఎమ్మెల్యే,ఎంపీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎస్ఐ మల్లికార్జున అన్నారు. బుధవారం తుగ్గలిలో స్థానిక ప్రజలతో ఎస్ఐ మల్లికార్జున మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలందరితోపాటు పలు రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఎంతో సహకరించారన్నారు. ముందు జాగ్రత్తగా వివిధ రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలపై బైండోవర్ కేసులు పెట్టడం వల్ల, ఘర్షణలు జరిగితే కలిగే నష్టాలను ప్రజలకు, రాజకీయ పార్టీ నాయకులకు పోలీసులు చేయడంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. సహకరించిన అందరికీ ఎస్ఐ కృతజ్ఞతలు తెలిపారు.